రిపోర్టర్లు కావలెను
పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.
అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం
మరిన్ని వివరాలకు సంప్రదించగలరు 8125972476
క్విక్ టుడే

quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక



EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక 42 | సోమవారం 27 అక్టోబర్ 2025 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

## 21వ శతాబ్దం ఆసియాన్ దేశాలదే

### ఆసియాన్ దేశాల సమావేశంలో వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, అక్టోబర్26:**
21వ శతాబ్దం ఆసియాన్ దేశాలదేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆసియాన్ దేశాల సమావేశం మలేషియాలో జరుగుతుండగా ఆదివారం ప్రధాని వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తొలుత ఆ దేశ ప్రధానికి మోదీ అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 21వ శతాబ్దం ఆసియాన్ దేశాలదేనన్నారు. మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం తనకు స్నేహితుడని.. ఆసియాన్ కుటుంబంలో చేరడానికి నాకు అవకాశం ఇచ్చినందుకు తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. కొత్త సభ్య దేశంగా చేరిన తిమోర్ లెస్టేకు స్వాగతం పలికారు. థాయ్‌లాండ్ క్వీన్ మదర్ మరణంపై సంతాపం ప్రకటించారు. భారత్, ఆసియాన్ కేవలం భౌగోళికంగా మాత్రమే కాకుండా.. సంస్కృతి, విలువల పరంగానూ దగ్గరగా ఉన్నాయని చెప్పారు. సదస్సు విజయవంతంగా నిర్వహించినందుకు అన్వర్ ఇబ్రహీంకు అభినందనలు చెప్పారు. ఆసియాన్ భారతదేశ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'లో కీలక స్తంభమని, ఆసియాన్ సెంట్రాలిటీని, ఇండో పసిఫిక్ దృష్టికోణాన్ని భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టమైందన్నారు. రెండు ప్రాంతాల మధ్య వాణిజ్య సంబంధాలు మాత్రమే కాక ఆధ్యాత్మిక, సాంస్కృతిక బంధాలు కూడా బలంగా ఉన్నాయన్నారు. ప్రపంచంలో ఏర్పడుతున్న అనిశ్చిత పరిస్థితుల్లో భారత్-ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం నిరంతరం బలపడుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ ఏడాది ఆసియాన్ సదస్సు థీమ్ 'ఇంక్లూజివిటీ అండ్ సస్టైనబిలిటీ'గా ఉండడం ఉమ్మడి కృషిని ప్రతిబింబిస్తున్నదని, డిజిటల్ ఇన్‌క్లూజన్, ఫుడ్ సెక్యూరిటీ, సరఫరా గొలుసు స్థిరత్వం వంటి రంగాల్లో సహకారం మరింత బలోపేతమవుతుందన్నారు. సమన్వయకర్త పాత్రను సమర్థవంతంగా నిర్వర్తించినందుకు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ బలమైన భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వానికి, అభివృద్ధికి మూలం అవుతోందన్నారు. థాయిలాండ్ రాణి తల్లి మరణంపై భారతీయుల తరపున ప్రగాఢ సంతాపాన్ని ఈ సందర్భంగా మోదీ తెలియజేశారు.






## 3 నుంచి ప్రైవేట్ కాలేజీల బంద్


### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బంద్‌కు పిలుపు

**హైదరాబాద్, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):**
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని లేదంటే నవంబర్ 3 నుంచి నిరవధికంగా కాలేజీలను బంద్ చేయనున్నట్లు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య స్పష్టం చేసింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 900 కోట్ల బకాయిలను నవంబర్ 1వ తేదీలోగా చెల్లించాలని డిమాండ్ చేసింది. లేదంటే నవంబర్ 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కళాశాలలను నిరవధికంగా మూసివేస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు సమాఖ్య ఛైర్మన్ ఎన్. రమేశ్ బాబు ఆదివారం హైదరాబాద్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం తమకు మొత్తం రూ. 1200 కోట్ల ఫీజు బకాయిలు ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ. 300 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. మిగిలిన రూ. 900 కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, మంత్రులు మా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకపోతే కాలేజీలను నడపడం కష్టమని, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే నవంబర్ 10న సుమారు 2 లక్షల మందితో భారీ సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. విచారణల పేరుతో ప్రభుత్వం తమను భయపెట్టాలని చూస్తోందని, పోలీసులను పంపితే ఒక్కరిని కూడా కాలేజీ ప్రాంగణంలోకి అనుమతించబోమని ఆయన మండిపడ్డారు.

## జీఎస్టీ మార్పుతో అన్ని వర్గాల్లో సంతోషం

### దసరా, దీపావళికి భారీగా కొనుగోళ్లు

### మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, అక్టోబర్26:**
జీఎస్టీ శ్లాబులలో తీసుకొచ్చిన మార్పుల కారణంగా అన్ని వర్గాల్లో సంతోషాన్ని నింపాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. దసరా, దీపావళి పండుగల వేళ కొనుగోళ్లు భారీగా పెరిగాయని అన్నారు. మన్‌కీ బాత్ 127వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. జీఎస్టీ మార్పులవల్ల ఈ సీజన్లో దేశీయ వస్తువుల కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయన్నారు. వంట నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించాలని రాసిన లేఖకు సానుకూల స్పందన వచ్చిందని ప్రధాని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపుర్‌లో గార్బేజ్ కేఫ్ వినూత్నంగా పర్యావరణానికి సేవలు అందిస్తోందని తెలిపారు. అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను ఇచ్చి ఫుల్ మీల్స్ తినొచ్చు. మీరు కిలో వ్యర్థాలు ఇస్తే.. లంచ్ లేదా డిన్నర్ ఏర్పాటు చేస్తారు. అదే అరకిలో ఇస్తే అల్పాహారం ఇస్తారు. ఈ కేఫ్‌ను అంబికాపూర్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తోందని ప్రధాని అభినందించారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరుపుకుంటున్న ఛాత్‌పూజ మహోత్సవం గురించి, మావోయిస్టుల గురించి ప్రస్తావించారు. దేశంలో మావోయిజం ముగింపు దశకు చేరుకుందని కూడా ప్రధాని మోదీ మాట్లాడారు.





## మద్యంమత్తులో బైక్ యువకుడు

### కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

### ఫోరెన్సిక్ నివేదికలో స్పష్టమైనట్లు వెల్లడి

**కర్నూలు, అక్టోబర్26 (క్విక్ టుడే న్యూస్):**
కర్నూలు జిల్లాలో 19 మందిని బలిగొన్న బస్సు అగ్నిప్రమాద ఘటనలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి కారణమైన బైక్ నడిపిన యువకుడు మద్యం మత్తులో ఉన్నట్లు ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడైంది. అయితే, బస్సు డ్రైవర్ మద్యం సేవించలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ దారుణ ఘటనకు బైకర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఫోరెన్సిక్ నివేదికతో పాటు, అతనితో ప్రయాణిస్తున్న స్నేహితుడి వాంగ్మూలం కూడా బలపరుస్తోంది. కర్నూలు రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నుంచి వచ్చిన నివేదిక ఈ విషయాన్ని ధృవీకరించింది. బైక్ నడుపుతూ డివైడర్‌ను ఢీకొని మరణించిన బి. శివశంకర్ (22) మద్యం సేవించి ఉన్నాడని ఫోరెన్సిక్ రిపోర్టులో తేలిందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం మీడియాకు తెలిపారు. శివశంకర్‌తో పాటు బైక్‌పై ఉన్న అతని స్నేహితుడు ఎర్రిస్వామి కూడా తాము ఇద్దరం మద్యం సేవించామని పోలీసుల ఎదుట అంగీకరించాడు. ప్రమాదం తర్వాత బస్సులో మంటలు చెలరేగడంతో భయంతో అక్కడి నుంచి పారిపోయినట్లు ఎర్రిస్వామి చెప్పాడు. అంతకుముందు శివశంకర్ మృతదేహాన్ని రోడ్డు పక్కకు లాగి, రోడ్డు మధ్యలో పడి ఉన్న బైక్‌ను తీసేలోపే వేగంగా వచ్చిన బస్సు దాన్ని ఢీకొట్టిందని వివరించాడు. చిన్నటేకూరు వద్ద రోడ్డుపై పడి ఉన్న పల్సర్ బైక్‌ను ఢీకొట్టిన బస్సు, దానిని సుమారు 200 మీటర్ల దూరం లాక్కెళ్లింది. ఈ క్రమంలో బైక్ నుంచి పెట్రోల్ లీక్ అవ్వడం, ఘర్షణ కారణంగా నిప్పురవ్వలు చెలరేగడంతో క్షణాల్లో డబుల్ డెక్కర్ బస్సు మొత్తం మంటల్లో చిక్కుకున్నట్లు వివరించారు. ఈ ఘటనపై ప్రయాణికుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య, వి. కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్ పై నిర్లక్ష్యంగా వ్యవహరించి మరణాలకు కారణమయ్యారన్న ఆరోపణలతో బీఎన్ఎస్ సెక్షన్ 106(1), 125(ఎ) కింద కేసులు పెట్టారు. మరోవైపు, ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు మద్యం తాగి నిర్లక్ష్యంగా బైక్ నడిపినందుకు మృతుడు శివశంకర్‌పైనా ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇదే సమయంలో బస్సు డ్రైవర్ లైసెన్స్‌పైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. కేవలం 5వ తరగతి చదివిన లక్ష్మయ్య, 10వ తరగతి నకిలీ సర్టిఫికెట్‌తో హెవీ వెహికల్ లైసెన్స్ పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రవాణా వాహనం నడపాలంటే కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన ఉంది. అలాగే, బస్సును నిబంధనలకు విరుద్ధంగా స్లీపర్ కోచ్‌గా మార్చడం, డామన్ డయ్యూలో రిజిస్టర్ అయి ఉన్న బస్సును ఈ ఏడాదే ఒడిశాలో రీ-రిజిస్టర్ చేయడం వంటి అంశాలపై కూడా రవాణా శాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు.



## బిహార్‌లో ప్రచారానికి కాంగ్రెస్ కసరత్తు

### తొలి దశ ప్రచారం కోసం 40 మంది అగ్రనేతలు

### ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ ప్రచారం

### స్టార్ క్యాంపెయినర్లతో కూడిన జాబితా ప్రకటన

**న్యూఢిల్లీ, అక్టోబర్26:**
బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం కోసం కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేస్తోంది. తొలి దశ ఎన్నికల కోసం 40 మంది స్టార్ క్యాంపెయినర్లతో కూడిన జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఈ జాబితాలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలకు చోటు కల్పించింది. మరికొంత మంది ప్రముఖులలో కన్హయ్య కుమార్, స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్ (రాజేష్ రంజన్), ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, భూపేష్ బఘేల్, సచిన్ పైలట్, రణ్‌దీప్ సుర్జేవాలా, సయ్యద్ నసీర్ హుస్సేన్ వంటి కీలక నేతలు కూడా ఉన్నారు. రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, దిగ్విజయ్ సింగ్, అధీర్ రంజన్ చౌదరి, మీరా కుమార్, తారిఖ్ అన్వర్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. బీహార్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కృష్ణ అల్లవారపు, పీసీసీ అధ్యక్షుడు రాజేష్ రామ్, సీనియర్ నేతలు గౌరవ్ గొగోయ్, మహమ్మద్ జావేద్, అఖిలేశ్ ప్రసాద్ సింగ్ వంటి స్థానిక నేతలకు కూడా ప్రచార బాధ్యతలు అప్పగించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు భాగస్వాములుగా ఉన్న 'ఇండియా' కూటమి, తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ పేరును ప్రకటించారు.





## 21మంది మావోల లొంగుబాటు

### ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులకు ఆయుధాలు అప్పగింత

**రాయ్‌పూర్, అక్టోబర్26:**
ఛత్తీస్‌గఢ్‌లోని కంకేర్ జిల్లా అంతాగఢ్‌లో 21 మంది కీలక మావోయిస్టులు ఆదివారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పూనా మర్గం' పునరావాస విధానం సత్ఫలితాలు ఇస్తుండటంతో ఈ లొంగుబాట్లు పెరుగుతున్నాయి. లొంగిపోయిన వారిలో నలుగురు డివిజన్ వైస్ కమిటీ సభ్యులు (డీవీసీఎం), 9మంది ఏరియా కమిటీ సభ్యులు (ఏసీఎం), 8మంది పార్టీ సభ్యులు ఉన్నారు. వీరిలో 13 మంది మహిళలు ఉండటం గమనార్హం. కేశ్‌కల్ డివిజన్‌లో కీలకమైన డివిజన్ కమిటీ కార్యదర్శి ముఖేష్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు. వీరంతా ఏళ్లుగా అంతాగఢ్ ప్రాంతంలో హింసాత్మక ఘటనలకు పాల్పడుతూ క్రియాశీలంగా ఉన్నారు. ఆదివారం ఉదయం బర్రెబెడ గ్రామం నుంచి పోలీసుల బృందం వీరిని స్థానిక క్యాంపునకు తీసుకొచ్చింది. వీరు తమ వెంట ఏకే-47 రైఫిళ్లు మూడు, సెల్ఫ్-లోడింగ్ రైఫిల్స్ (ఎస్ఎల్ఆర్) నాలుగు, రెండు ఇన్సాస్ రైఫిల్స్, ఆరు .303 రైఫిల్స్‌తో పాటు మొత్తం 18 అత్యాధునిక ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. వీటి విలువ బ్లాక్ మార్కెట్‌లో రూ. 10 లక్షలకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. సరిగ్గా ఒకరోజు ముందే కమ్టేడా క్యాంపులో 50 మంది నక్సలైట్లు లొంగిపోవడం గమనార్హం. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ '''పూనా మర్గం - పునరుజ్జీవనానికి పునరావాసం' కార్యక్రమం బస్తర్‌లో మావోయిస్టుల ప్రజా వ్యతిరేక సిద్ధాంతాన్ని కూల్చివేసి, శాంతి, అభివృద్ధికి కొత్త శకాన్ని ప్రారంభించింది. మావోయిస్టుల తప్పుడు వాగ్దానాలతో దారితప్పిన యువత ఇప్పుడు అభివృద్ధి బాట పడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యూహాత్మక మార్గదర్శకత్వంతోనే ఈ మార్పు సాధ్యమైందని సీఎం తెలిపారు. బస్తర్ ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందని, మావోయిస్టుల ప్రభావం బలహీనపడిందని అన్నారు. 2026 మార్చి 31 నాటికి దేశాన్ని నక్సల్ రహితంగా మార్చేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.